క్లుప్తంగా

మసీద్‌కు కుర్చీల బహూకరణ



కుర్చీలు అందజేస్తున్న శ్రీరాములు

మునగాల : మండలంలోని మాధవరంలో గల మదీనా మసీద్‌కు అదే గ్రామానికి చెందిన గొట్టిపర్తి శ్రీరాములు తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం శుక్రవారం సుమారు రూ.35 వేల విలువ గల 60 కుర్చీలను బహూకరించారు. ఈ సందర్భంగా దాత రాములును ముస్లింలు శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మజీద్ సదర్ షేక్ సైదా, ముస్లిం పెద్దలు హుస్సేన్, బుజ్జులు, బొజ్జమియా, నాగుల్, ఫకీర్, అహ్మద్ పాల్గొన్నారు.

గిరిజన మోర్చా నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా బాలునాయక్



మఠంపల్లి : బీజేపీ గిరిజన మోర్చా హుజూర్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా మఠంపల్లి మండలంలోని కొత్తదొనబండతండాకు చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు బానోతు బాలునాయక్ నియమితులయ్యారు. ఈమేరకు గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కళ్యాణ్‌నాయక్ శుక్రవారం నియామక ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ సందర్భంగా బాలునాయక్ స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి గిరిజనుల మద్దతును మరింత కూడగట్టేందుకు కృషిచేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన పార్టీ రాష్ట్ర జిల్లా, స్థానిక నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

నడిగూడెం ఇన్‌చార్జ్ ఎంపీఓగా దుర్గాప్రసాద్

నడిగూడెం : నడిగూడెం మండల ఇన్‌చార్జ్ ఎంపీఓగా నడిగూడెం గ్రామ పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్‌ను నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటరావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీడీఓ ఎస్.డి ఇమామ్ తెలిపారు. మండలంలో దుర్గాప్రసాద్ సీనియర్ పంచాయతీ కార్యదర్శి కావడంతో ఆయనను ఎంపీఓగా నియమించినట్లు ఆయన పేర్కొన్నారు.

1న బొడ్రాయి పునఃప్రతిష్ఠ వార్షికోత్సవం



వార్షికోత్సవ ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న కమిటీ సభ్యులు

కోదాడఅర్బన్ : కోదాడ పట్టణంలోని బొడ్రాయి పునఃప్రతిష్ఠ ఆరవ వార్షికోత్సవాన్ని ఏప్రిల్ 1వ తేదీన నిర్వహించనున్నట్లు బొడ్రాయి ప్రతిష్ఠ కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. శుక్రవారం ప్రచార రథాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. వార్షికోత్సవంలో ప్రజలంతా భాగస్వామ్యులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు కమిటీ, ముత్యాలమ్మ కమిటీ, పునఃప్రతిష్ఠ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నీరు వృథా



పుల్లంబండతండాలో వృథాగా పోతున్న నీరు

నేరేడుచర్ల : మండలంలోని పుల్లంబండ తండాలోని ఓవర్ హెడ్ ట్యాంకు వద్ద పైపులైన్ పగిలి మిషన్ భగీరథ నీరు వృథాగా పోతోంది. పైపులైన్ పగలడంతో నీరు సరఫరా కాక తాగునీటికి గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టి ఇంటింటికీ నీరందించాలని స్థానికులు కోరుతున్నారు.

బూరుగడ్డ ఆలయంలో కుంకుమార్చనలు



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఆలయ చైర్మన్, ఈఓ

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి ఆలయంలో శుక్రవారం సహస్రనామ కుంకుమార్చనను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, సహస్రనామ కుంకుమార్చన, ఆరాధన, స్వామివార్లకు పంచామృతాలతో అభిషేకం, మంగళశాసనం, గోమాతకు పూజ, తీర్థప్రసాద వినియోగం, తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ ఈఓ లక్ష్మణరావు ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గండు సైదులు, అర్చకులు ముడుంబై హరీష్‌కుమార్‌చార్యులు, ఆలయ సిబ్బంది గోవిందరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

ముంచుకొస్తున్న తాగునీటి ముప్పు

- అడుగంటుతున్న కోదాడ పెద్దచెరువు
- వట్టిపోయిన బోర్లు, బావులు
- నీటి కోసం పట్టణవాసుల ఇబ్బందులు
- ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్న మున్సిపల్ అధికారులు



అడుగంటిన కోదాడ పెద్ద చెరువు

కోదాడ : కోదాడ పట్టణవాసులకు తాగునీటి ముప్పు ముంచుకొస్తోంది. గడిచిన 20 ఏళ్లలో ఎన్నడూ లేనివిధంగా మార్చి నెల గడవక ముందే కోదాడ పెద్ద చెరువులో నీటి మట్టం కనిష్ట స్థాయికి పడిపోవడం ఆందోళన కలిగిస్తుంది. దీని ప్రభావంతో కోదాడ పట్టణంలోని బోర్లలో నీటి మట్టం పడిపోవడంతో కనీస అవసరాలకు ప్రజలు నీటిని ట్యాంకర్ల ద్వారా కొనుగోలు చేస్తున్నారు. ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే రానున్న ఏప్రిల్, మే నెలల్లో పరిస్థితిని తలచుకుంటేనే భయం అవుతుందని పట్టణవాసులు అంటున్నారు. వేసవిలో నీటి ఎద్దటి నివారణ కోసం కోదాడ మున్సిపాలిటీకి ప్రభుత్వం కోటి నాలుగు లక్షల రూపాయలను మంజూరు చేసినప్పటికీ వేసవి గండం గట్టెక్కడం కష్టమేనని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రెండు రోజులకొకసారి నీటి సరఫరా

పట్టణంలో ప్రస్తుతం రోజు విడిచి రోజు మంచినీటిని మున్సిపాలిటీ సిబ్బంది సరఫరా చేస్తున్నారు. మిషన్ భగీరథ నీటితో పాటు పట్టణంలో ఉన్న మంచినీటి బావుల నుంచి కూడా నీటిని సరఫరా చేస్తున్నారు. కోదాడ పెద్దచెరువు నీటి మట్టం తగ్గిపోవడంతో రామ్మూర్తినగర్‌లోని తాగునీటి బావి, రంగనిగుడి బావి, అంబేద్కర్‌నగర్‌లో గల బావిలో నీటి మట్టం గణనీయంగా పడిపోవడంతో నీటి సరఫరాలో తీవ్ర ఇబ్బంది ఎదురవుతున్నట్లు సమాచారం. మున్సిపాలిటీకి ఉన్న ట్యాంకర్లతో పాటు మరికొన్నింటిని అద్దెకు తీసుకొని నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలకు సరఫరా చేయాలని పట్టణవాసులు కోరుతున్నారు.

జోరుగా నీటి వ్యాపారం

కోదాడలో నీటి ఎద్దడి ప్రారంభం కావడంతో నీటి వ్యాపారం జోరందుకుంది. పట్టణంలో హోటళ్లు, బేకరీలు, రెస్టారెంట్ల వ్యాపారులు ట్యాంకర్ల ద్వార నీటిని కొనుగోలు చేస్తున్నారు. కొన్ని చోట్ల అపార్టుమెంట్లలో కూడా నీటిని కొనుగోలు చేస్తున్నారు. నీటి ఎద్దటి నివారణ కోసం ప్రభుత్వం అత్యవసర నిధుల నుంచి కోటి నాలుగు లక్షల రూపాయలను మంజూరు చేసింది. ఈ నిధులతో మంచినీటి సరఫరాను ఎలా మెరుగు పరుస్తారో వేచి చూడాలని పట్టణ ప్రజలు అంటున్నారు. యుద్ధప్రాతిపదికన మంచినీటి సమస్య ఎదురుకాకుండా చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.

నీటి సమస్యను పరిష్కరిస్తాం

కోదాడ పట్టణంలో తలెత్తిన తాగునీటి సమస్యను సమర్థవంతంగా పరిష్కరిస్తాం. నీటి ఎద్దడిపై ప్రజలు ఆందోళన చెందొద్దు. నీటి కోసం ఇప్పటికే ప్రభుత్వం నుంచి కోటి నాలుగు లక్షల రూపాయలను మంజూరు చేయించాం. మున్సిపల్ అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో సమస్యను పరిశీలించి పరిష్కరించాలి. దీని కోసం ప్రత్యేక అధికారులను కూడా నియమించాం. ప్రజల ఇబ్బందిని పట్టించుకోకపోతే చర్యలు తప్పవు.

– నలమాద పద్మావతి, ఎమ్మెల్యే, కోదాడ

సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మల్లికార్జునరావు

హుజూర్‌నగర్ : మఠంపల్లి మండలం మట్టపల్లిలో శనివారం నిర్వహించబోయే నల్లగొండ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జునరావు కోరారు. శుక్రవారం హుజూర్‌నగర్ పట్టణంలోని ఇందిరా భవన్‌లో కాంగ్రెస్ బూత్ కమిటీ అధ్యక్షులు, మున్సిపల్ కౌన్సిలర్లు, ముఖ్య నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమావేశానికి ఏఐసీసీ ఇన్‌చార్జ్, ఏఐసీసీ సెక్రటరీ, మంత్రులు తదితరులు హాజరు అవుతున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు సాముల శివా రెడ్డి, గూడెపు శ్రీనివాస్, గెల్లి రవి, కోతి సంపత్‌రెడ్డి, జక్కుల మల్లయ్య, కస్తాల శ్రవణ్, దొంతగాని శ్రీనివాస్, మజీద్, గల్లా వెంకటేశ్వర్లు, గొట్టె రామయ్య, ముశం సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని వినతి



మంత్రి ఉత్తమ్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా నాయకులు

నేరేడుచర్ల : నేరేడుచర్ల మున్సిపాలిటీలోని ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్న పేదలకు శాశ్వత పట్టాలను ఇవ్వాలని కోరుతూ శుక్రవారం సూర్యాపేటలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి సీపీఐఎంఎల్ ప్రజా పంథా ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య మాట్లాడారు. గత ఏడేళ్లుగా ప్రభుత్వ భూమిలో ఇళ్ల స్థలాలు ఇవ్వాలని అనేక పోరాటాలు చేసినా గత పాలకులు పట్టించుకోలేదని ఆయన అన్నారు. అంతేకాకుండా అక్రమ కేసులను బనాయించారని తెలిపారు. ఇప్పటికైనా పేదలకు ఇళ్ల స్థలాలు, పట్టాలు ఇవ్వడంతోపాటు ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలని ఆ పత్రంలో కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు జి. వెంకటేశ్వర్‌రావు, వాస పల్లయ్య, కొత్తపల్లి శివకుమార్, రేణుక, అఖిల్‌కుమార్, హుస్సేన్, కరుణాకర్ తదితరులు ఉన్నారు.

విజేతలకు బహుమతులు అందజేత



క్రికెట్ విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంపీపీ బిందు

మునగాల : మండలంలోని రేపాలలో స్వయంభు లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా గత ఆరు రోజులుగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో విజేతలకు గురువారం రాత్రి ఆలయం ఆవరణలో ఎంపీపీ ఎలక బిందు, ఆలయ కమిటీ అధ్యక్షుడు సారిక చిన రామయ్య చేతుల మీదుగా బహుమతులు, షీల్డులు అందజేశారు. ఈ పోటీల్లో మొదటి బహుమతిని సూర్యాపేటకు చెందిన ఎస్ఎస్‌కె టీమ్, రెండవ బహుమతిని రేపాల ఆర్గనైజేషన్ టీమ్, మూడవ బహుమతిని నర్సింహులగూడెం బుల్లెట్స్ టీమ్, నాల్గవ బహుమతిని అంబేద్కర్ యూత్ నర్సింహులగూడెం టీమ్ అందుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, క్రికెట్ పోటీల నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలి



మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను

చిలుకూరు : యువత మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను అన్నారు. శుక్రవారం చిలుకూరు గ్రామంలో జరిగిన ఏఐవైఎఫ్ మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత మతం పేరుతో దేశం చీలిపోయిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఏడాదికి కోటి ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఇవ్వకుండా యువతను మోసం చేసిందని ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల్లో యువత బీజేపీని ఓడించి తగిన బుద్ధి చెప్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు అనంతుల రాము, కదారు మధు, కిషోర్, రవి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం



రెండవ వార్డులో పైపులైన్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ, కార్యదర్శి

చిలుకూరు : గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని ఎంపీడీఓ, చిలుకూరు గ్రామ ప్రత్యేక అధికారి గిరిబాబు అన్నారు. శుక్రవారం చిలుకూరు గ్రామంలోని రెండవ వార్డులో తాగునీటి పైపులైన్ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులు నల్లాల ద్వారా వచ్చే తాగునీటిని వృథా చేయొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి షరీఫ్‌వుద్దీన్, ధర్మయ్యగౌడ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

అర్వపల్లి : మండల పరిధిలోని కాసర్లపహాడ్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు బొల్లం లింగరాజు ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురికావడంతో కాలు విరిగింది. అలాగే గ్రామ పంచాయతీ మాజీ వార్డు సభ్యుడు డాక్టర్ దిర్శనపు రాజేష్ కూడా రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఇద్దరిని శుక్రవారం తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు పరామర్శించారు. కాంగ్రెస్ కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మోరపాక సత్యం, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు రమేష్, నసీర్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ అవిలయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఆత్మకూర్ (ఎస్) : అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను శుక్రవారం ఆత్మకూరు మండల కేంద్రంలో పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. పాతర్లపహాడ్‌కు చెందిన జటంగి ముత్తయ్య ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా బోరింగ్ తండా వద్ద పోలీసులు అడ్డుకున్నారు. అనుమతులు లేకపోవడంతో ట్రాక్టర్‌ను స్టేషన్‌కు మళ్లించారు. ఇసుక కేసు నుంచి తప్పించుకోవాలనుకున్న డ్రైవర్ ముత్తయ్య ఆత్మకూరు సమీపంలో ట్రాక్టర్‌ను చాకచక్యంగా ఫల్టీ కొట్టించి దూకేశాడు. దీంతో ఆత్మకూరు పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలను రెవెన్యూ అధికారులకు పంపినట్లు ఎస్ఐ సైదులు తెలిపారు. ఇదే ట్రాక్టర్‌ను గురువారం ఇసుక తరలిస్తుండగా నూతనకల్ పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేసినట్లు తెలిసింది.

చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని కలిసిన నాయకులు

తుంగతుర్తి : భువనగిరి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో శుక్రవారం తుంగతుర్తి యూత్ కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు పెద్దబోయిన అజయ్‌కుమార్, కొండరాజు, జలేందర్, రమేష్, యాకన్న, రాము తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వరికోతలు

- వ్యవసాయ పనుల్లో రైతన్నలు నిమగ్నం
- 18 వేల ఎకరాల్లో వరి సాగు
- ఆశాజనకంగానే దిగుబడి



సాగర్ ఆయకట్టులో వరి పంట కోస్తున్న మిషన్

మునగాల : సాగర్ ఆయకట్టులో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. మునగాల మండలంలోని ఆయా గ్రామాలలో గత పక్షం రోజుల క్రితం వరి కోతలు ప్రారంభం అయ్యాయి. పలు ప్రాంతాల నుంచి వచ్చిన యంత్రాలతో వరి పంట కోపిస్తున్నారు. యాసంగిలో రైతాంగం ఎక్కువగా చింట్లు, హెచ్ఎంటీ రకాలను సాగుచేశారు. కాగా, పంట దిగుబడి ఆశాజనకంగా ఉందని రైతులు అంటున్నారు. ఎకరాకు 35 నుంచి 45 బస్తాల వరకు దిగుబడి వస్తుందని చెబుతున్నారు. ధర కూడా అనుకూలంగానే ఉందని ప్రస్తుతం బస్తా (75కేజీల) ధర రూ.1800 వరకు ఉందని కొనుగోలుదారులు నేరుగా రైతుల పొలాల వద్దకు వచ్చి కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. మండల పరిధిలో ప్రస్తుత యాసంగి సీజన్‌లో 18 వేల ఎకరాలలో వరిసాగు చేసినట్లు వ్యవసాయ శాఖ సిబ్బంది తెలిపారు.

దిగుబడి ఆశాజనకంగా ఉంది



ప్రస్తుత యాసంగిలో వరి పంట దిగుబడి ఆశాజనకంగా ఉంది. ధర కూడా అనుకూలంగానే ఉంది. ధాన్యం కొనుగోలుదారులు పుష్కలంగా వస్తున్నారు. వరికోత యంత్రాలు అందుబాటులో ఉన్నాయి.

– తూముల వీరస్వామి, రైతు, మునగాల

అందుబాటులో వరికోత యంత్రాలు..

వరిపొలాలను కోసేందుకు యంత్రాలు అందుబాటులో ఉన్నట్లు రైతులు తెలిపారు. ప్రస్తుతం ఒక ఎకరా పొలం కోసినందుకు చైన్ మిషన్‌కు రూ.3 వేలు, ఫోర్ వీల్ మిషన్‌కు ఎకరాకు రూ.2400, టూ వీలర్ మిషన్‌కు రూ.2 వేల చొప్పున రైతుల నుంచి వసూలు చేస్తున్నారు. మండల వ్యాప్తంగా మరో 15 రోజుల పాటు వరికోతలు కొనసాగుతాయి. ఇదిలా ఉండగా మండల వ్యాప్తంగా వాతావరణం అనుకూలంగా ఉండడంతో రైతులు ఆనందంగా ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే



హుజూర్‌నగర్‌రూరల్ : వేపలసింగారంలో ఏసుక్రీస్తు వేషధారణలో శిలువ మోస్తున్న భక్తుడు



గరిడేపల్లి : పానుగోడులో..

మునగాల : మండల వ్యాప్తంగా గల పెనుయేలు వర్షిప్ కేంద్రాల్లో శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మునగాలలోని పెనుయేలు వర్షిప్ కేంద్రంలో పెనుయేలు సంస్థ వ్యవస్థాపకుడు బిషప్.డా.జె.సుదర్శనమ్ గుడ్ ఫ్రైడేను ఉద్దేశించి మాట్లాడారు. సర్వ మానవాళిని పాపముల నుంచి యేసుక్రీస్తు విడిపించారన్నారు. ప్రతిఒక్కరూ బైబిల్ మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెజె.సామ్యూల్‌సన్, కె.రాజు, కరుణ, సువార్తరాజు, తిరుమల, తబితమ్మ, లూథియా, రాహేలమ్మ, ఉదయ్, సతానియేలు పాల్గొన్నారు.

నడిగూడెం : మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలలో గల క్రైస్తవ ప్రార్థన మందిరాల్లో శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పలువురు పాస్టర్లు మాట్లాడుతూ బైబిల్ సందేశాన్ని బోధించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు కాసాని యేసురత్నం, బచ్చలకూరి గాబ్రియేలు, జయరాజు, కర్నాకర్, క్రైస్తవులు పాల్గొన్నారు.

గరిడేపల్లి : మానవాళిని పాప విముక్తులను చేయడానికే అవనిపై ఏసుక్రీస్తు అవతరించాడని రెవరెంట్ ఫాదర్ అరిక జోసేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని పానుగోడు గ్రామంలోని సెయింట్ మేరీస్ చర్చిలో జరిగిన గుడ్ ఫ్రైడే వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో రెవరెంట్ ఫాదర్ జోసెఫ్, రెవరెంట్ ఫాదర్ నరేష్, సిస్టర్స్ జైమోల్, అనూష, మేరీ తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని వేపలసింగారంలో గుడ్‌ఫ్రై డే వేడుకలను శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీస్తు బోధనలను భక్తులను వివరించారు. అనంతరం శిలువ మార్గం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ తుమ్మ ఇన్నారెడ్డి, భక్తులు లక్కవళ్ల రత్నం, బాగ్యరాజు, అరవింద్, సాయి, మరియమ్మ, సుజిక తదితరులు పాల్గొన్నారు.

నేరేడుచర్ల : మండల వ్యాప్తంగా గుడ్ ఫ్రైడే వేడుకలను శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా నేరేడుచర్ల మున్సిపాలిటీలోని రాంపురం చర్చి నుంచి సాగర్ రాజు ఆధ్వర్యంలో శిలువతో భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం సాగర్ రాజు మాట్లాడుతూ ఏసుక్రీస్తు మానవాళి కోసం తన రక్తాన్ని చిందించి కలువరిలో శిలువపై తన ప్రాణాలను అర్పించినందుకు చిహ్నంగా గుడ్ ఫ్రైడే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతమళ్ల సైదులు, ప్రాన్సిస్, లూకాస్, పాపయ్య, ప్రకాశ్‌రెడ్డి, బర్తులూం, బాలస్వామి, శ్రీను, రవి, వినోద్, శేఖర్ తదితరులు ఉన్నారు.

కోదాడఅర్బన్ : కోదాడ పట్టణంలో శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నయానగర్ బాప్టిస్ట్ చర్చిలో పాస్టర్ ఏసయ్య మాట్లాడారు. గత 40 రోజులుగా ఉపవాస దీక్షలో ఉన్న భక్తులు గుడ్ ఫ్రైడే రోజున భక్తిశ్రద్ధలతో కీర్తనలు ఆలపించి ఉపవాస దీక్షను విరమిస్తారని తెలిపారు. కాగా, బుత్తికొండ కోటయ్య, మౌనిక, సుమలతలు ఉపవాస దీక్షలో ఉన్న భక్తులకు కూల్‌డ్రింక్స్, మజ్జిగ అందజేసి దీక్షను విరమింపజేశారు.

మేళ్లచెరువు : మండలంలోని అన్ని గ్రామాల్లో గుడ్ ఫ్రైడే వేడుకలను క్రైస్తవులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గ్రామాల్లోని వీధుల గుండా శిలువను మోయు (శిలువ మార్గం) కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భక్తులకు రొట్టె ముక్కలు, ద్రాక్ష రసం అందించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



మునగాల : పెనుయేలు వర్షిప్ కేంద్రంలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



కోదాడఅర్బన్ : బాప్టిస్ట్ చర్చిలో..



మేళ్లచెరువులో..



మునగాల : గుడ్ ఫ్రైడే ప్రాధాన్యతను వివరిస్తున్న పాస్టర్ సుదర్శనమ్



నేరేడుచర్ల : దిర్శించర్లలో..



నేరేడుచర్లలో..

జక్కుల వీరయ్యకు సన్మానం

మేళ్లచెరువు : హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన అడ్వకేట్ జక్కుల వీరయ్య యాదవ్‌ను యాదవ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మేళ్లచెరువులో శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సాధం గంగయ్య, జనిగ సైదులు, రుక్కయ్య, గురవయ్య, నాగరాజు, శ్రీనివాస్‌యాదవ్, వెంకటేశ్వర్లు, శంకర్, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.



జక్కుల వీరయ్యయాదవ్‌ను సత్కరిస్తున్న యాదవ సంఘం నాయకులు

ముగిసిన లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు

చివ్వెంల : ఉండ్రుగొండ గ్రామ శివారులోని గిరిదుర్గంలో వెలిసిన శ్రీ లక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా వేద పండితులు శ్రీమాన్ అరవిందాచార్యులు, సుబ్రహ్మణ్యాచార్యులు, శ్రీమాన్ క్రిష్ణామాచార్యులు మంత్రోచ్ఛరణతో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వస్తివచనం, విన్నపాలు, తీర్థగోష్ఠి, నిత్య హోమం, శ్రీలక్ష్మీహయగ్రీవ హోమం, మహాపూర్ణాహుతి, చక్రతీర్థం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ వేడుకల్లో శ్రీ లక్ష్మీ నర్సింహస్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు చకిలం క్రిష్ణకుమార్, డాక్టర్ ఆదుర్తి రామయ్య, బందకవి క్రిష్ణమోహన్, మురళీ క్రిష్ణ, యలగబోయిన శ్రీరాములు, కైరోజు శంకరాచారి, నర్సయ్య, శ్రీనివాస్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.